


జనసేనకు.. పండుగ



నేడే జనసేన ఆవిర్భావ దినోత్సవం

(కాకినాడ/ పిఠాపురం -ఆంధ్రజ్యోతి)

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ జరిగే చిత్రాడ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతోన్న తొలి ఆవిర్భావ సభకు పిఠాపురం మండలం వేదికగా మారడంతో అంతా పండగ వాతావరణం తలపిస్తోంది. శుక్రవారం జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభకు కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ భారీ ఏర్పాట్లతో సిద్ధమైంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది తరలి రానున్న సభను జయప్రదం చేయడానికి జనసేన పార్టీ ఎక్కడికక్కడ భారీ ఏర్పాట్లు చేసింది. ఈ 'జయకేతనం' సభ దద్దరిల్లేలా ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో సన్నాహాలు చేసింది.

అదిరే..ఆతిథ్యం

ఆవిర్భావ సభకు వచ్చే జనసేన నాయకులు, అభిమానులు భోజనాలు, తాగునీరు, స్నాక్స్ కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో విస్తృత ఏర్పాట్లుచేశారు. శుక్రవారం మధ్యాహ్నం, రాత్రి రెండు పూటలా భోజన సదుపాయాలతోపాటు సభా ప్రాంగణంలో నిరంతరాయంగా తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, పుచ్చకాయలు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. ధర్మవరం కోల్డ్‌స్టోరేజీ, యానాం రోడ్డు, అన్నవరం వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ భోజన కౌంటర్ల పర్యవేక్షణ బాధ్యతలను ఎమ్మెల్యేలకు అప్పగించారు. 20కిపైగా అంబులెన్స్‌లు, ఐదు వైద్య బృందాలను అందుబాటులో ఉంచారు. గురువారం మధ్యాహ్నానికే చిత్రాడకు వందలాదిమంది తరలివచ్చారు. వీరందరికి ఇక్కడే భోజన సదుపాయం కల్పించారు.



రహదారుల్లో జనసేన సందడి

డ్రోన్లు..సీసీ కెమెరాలు..

సభను నేరుగా చూసే అవకాశం లేని వారి కోసం సభా ప్రాంగణంలో 20కిపైగా ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. సభా ప్రాంగణం బయట జాతీయ రహదారిపై ఉండిపోయే వారి కోసం కూడా ప్రత్యేకంగా స్ర్కీన్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేసేందుకు సీసీ కెమెరాలతోపాటు డ్రోన్లతో పోలీసు శాఖ నిఘా ఉంచబోతోంది. సభా ప్రాంగణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. 10 నుంచి 15 డ్రోన్లతో సభా ప్రాంగణం, జాతీయ రహదారి, సభకు వచ్చే అన్ని మార్గాల్లో నిఘా ఏర్పాటు చేశారు. వాటిని నిరంతరాయం గమనించేందుకు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. బందోబస్తుకు 1700 మందికి పైగా పోలీసులను ఏలూరు రేంజ్ పరిధిలోని ఆయా స్టేషన్ల నుంచి రప్పించారు. వీరు గురువారం సాయంత్రానికే చిత్రాడ చేరుకున్నారు. ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాహన పార్కింగ్ ఇలా..

వాహనాల పార్కింగ్‌కు తొమ్మిది ప్రాంతాలు ఏర్పాటుచేశారు. కాకినాడ వైపు ఐదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు గుర్తించారు. 216వ జాతీయరహదారిపై కాకినాడ-కత్తిపూడి మధ్య ఆవిర్భావ సభకు వచ్చే వాహనాలు తప్ప మిగిలిన వాటి రాకపోకలను ప్రత్యామ్నాయ రహదారులపై మళ్లించారు. ఆర్టీసీ బస్సులు శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ ఈ మార్గంలో కాకుండా ఇతర మార్గాల్లో తిరిగేవిధంగా ఆయా మార్గాలను సూచించారు.

- ఒక రోజు ముందే పండగ
- చిత్రాడలో సభకు భారీ ఏర్పాట్లు
- లక్షల మంది వస్తారని అంచనా
- ఎకరం విస్తీర్ణంలో సభావేదిక
- 7 గ్యాలరీలు.. 3 మార్గాలు
- తొమ్మిది పార్కింగ్ ప్రదేశాలు
- భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్లు
- 'థాంక్యూ పిఠాపురం' నినాదం
- మధ్యాహ్నం 3 నుంచి సభ
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు
- 1700 మందితో బందోబస్తు

2 గంటలపాటు పవన్ ప్రసంగం

జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేరుగా అమరావతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు చిత్రాడ సభా ప్రాంగణం సమీపంలోని హెలిప్యాడ్‌లో దిగనున్నారు. సభా వేదికకు 500 మీటర్ల దూరంలోనే హెలిప్యాడ్‌ను నిర్మించారు. పవన్ దాదాపు రెండు గంటలకుపైగా ప్రసంగించే అవకాశం ఉంది. ఎన్నో మరపురాని జ్ఞాపకాలు ఇచ్చిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలిపేందుకు థాంక్యూ పిఠాపురం చెప్పుకుందాం! అనే నినాదంతో ఈ సభ జరగనున్నది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సభా కార్యక్రమాలు ప్రారంభమై రాత్రి పది వరకు జరుగుతాయి. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు, ఆడియో, వీడియో ప్రజెంటేషన్లు, ముఖ్య నేతల ప్రసంగాలు, చివరగా పవన్ ప్రసంగం ఉంటాయి.

24 ఎకరాల విస్తీర్ణంలో సభ



చిత్రాడ శివారు 24 ఎకరాల విస్తీర్ణంలో జనసేన ఆవిర్భావ సభ జయకేతనం నిర్వహిస్తున్నారు. 14 ఎకరాల విస్తీర్ణంలో ఏడు గ్యాలరీలు ఏర్పాటుచేసి రెండు మంది కూర్చునేందుకు ఏర్పాట్లు చేశారు. అంతకంటే అధికంగా వచ్చేవారు నిల్చుని సభా కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా సభా వేదికను నిర్మించారు. మూడు అంచెల్లో నిర్మించిన సభావేదిక మొదటి వరుసలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పార్టీ ఎం పీలు, ఎమ్మెల్యేలు ఆసీనులు కానున్నారు. మి గిలిన రెండు వరుసల్లో సుమారు 250 మంది ఆహ్వానితులు కూర్చునే విధంగా ఏర్పాట్లుచేశారు. సభావేదిక వెనుక భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. సభ చివర స్థానంలో కూర్చున్న వారికి కూడా పసంగాలు వినిపించేలా.. ఏర్పాట్లు చేశారు. అధునాతనంగా అందుబాటులోకి వచ్చిన లైటింగ్ సిస్టంను వినియోగించారు.

జనసేన జెండాల రెపరెపలు



భారీ ఎల్‌ఈడీ లైట్లతో ముస్తాబైన సభా వేదిక



హెలిప్యాడ్ పరిశీలన



"ప్రతిరోజూ నేను స్వయంగా ఇక్కడకు రాలేకున్నా నా మనసంతా ఇక్కడే ఉంటుంది.. నేను నోటితో చెప్పను.. పనులు చేసుకుంటూ వెళ్తా.. నా కళ్లు, చెవులు మీరే.. ఏ సమస్యనైనా నా దృష్టికి తీసుకు రండి.. పరిష్కరించేందుకు కృషి చేస్తా. ప్రత్యేకంగా అధికారులను పంపి ఇక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటున్నా" పిఠాపురం నుంచి ఎన్నికైన తరువాత డిప్యూటీ సీఎం పవన్‌చెప్పిన మాటలు ఇవి. ఆచరణలో వీటిని సాధించి చూపిస్తున్నారు.

- అభివృద్ధి దిశగా పిఠాపురం
- హామీల అమలులో ముందు
- మోడల్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ సీఎం పవన్ కృషి

నడిపించే.. నాయకుడొచ్చాడు!

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఒకనాడు పిఠాపురం.. నేడు పిఠాపురం వేరు.. పవన్ అన్నొచ్చాడు.. పనులు చేస్తున్నాడు.. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అధ్వానంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. కోట్లాది రూపాయలతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. 9 నెలల్లోనే ప్రతి అంశంలోనూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తనదైన ముద్రను బలంగా వేశారు.దేశంలోనే పిఠాపురం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది అందరిచూపూ ఇటువైపు ఉండేలా చూస్తానన్న పవన్‌కల్యాణ్ అందుకు తగ్గట్టుగా అడుగులు వేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటుచేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయించే ప్రక్రియ కొనసాగుతోంది. విజన్-2029 ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను ఇప్పటికే శాఖల వారీగా తయారుచేశారు. నాలుగేళ్లపాటు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయిస్తారు. పిఠాపురంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)ను 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.38 కోట్లతో ఆసుపత్రి అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న వైద్యులకు అదనంగా 23 మంది స్పెషలిస్టు వైద్యులు సహా 69 మంది అదనపు సిబ్బందిని నియమించడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించనున్నారు.

9 నెలలు.. అభివృద్ధి ఇలా..

- సుద్దగడ్డ కాలువపై రూ.4 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నారు. రూ.1.35 కోట్లతో పశువుల సంత ఆధునికీకరణ.
- ఉపాధి హామీ ద్వారా నియోజకవర్గంలో రోడ్ల పనులు చేస్తున్నారు. రూ.6 కోట్లతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. గొల్లప్రోలు, వన్నెపూడిల్లో ఎస్సీ శ్మశాన వాటికల మార్గాలకు ప్రత్యేకంగా భూసేకరణకు నిధులు కేటాయించారు.
- పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధునీకరణకు రూ. 1.75 కోట్లు మంజూరు చేయించారు. 32 ఉన్నత పాఠశాలలకు రూ.16 లక్షలతో 64 క్రీడాకిట్లు అందజేశారు. 33 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.3 కోట్లు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు.
- పిఠాపురం పాదగయ క్షేత్రం చెంతన రూ.కోటితో నగర వనం ఏర్పాటుకు శ్రీకారం
- పిఠాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ.73 లక్షలు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మాడవీధుల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరుచేసి పనులకు పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేశారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణం.
- గొల్లప్రోలులో రూ.44 లక్షలతో తహశీల్దార్ కార్యాలయం, అర్బన్ హెల్త్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభించాల్సి ఉంది.
- పట్టు రైతులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించి.. పరిహారం మంజూరు చేయించారు. గొల్లప్రోలు నుంచి సూరంపేట వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి రూ.26 లక్షలు కేటాయించారు.
- గొల్లప్రోలులో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.78 లక్షలతో పనులు నిర్వహించారు. ఇవేగాక పలు పనులకు నిధులివ్వడంతో పనులు జరుగుతున్నాయి.



సుద్దగడ్డ వాగుపై వంతెన వస్తోంది..



పల్లెలు.. పట్టణాలకు రోడ్లు పడ్డాయ్..



100 పడకల ఆసుపత్రి వచ్చేసింది..

రేపు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 15వ తేదీన ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ, జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ఒక అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్లు, కూరగాయలు మార్కెట్, మార్కెట్ యార్డు, రైతుబజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు తదితర ప్రాంతాలు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇలా పారిశుధ్య కార్యక్రమాల ద్వారా పర్యావరణానికి, ప్రజలకు కలిగే మేలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి చెరువులను కూడా ఈ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రపరచాలన్నారు. పర్యావరణానికి హాని లేని వస్తువులను మాత్రమే ప్రజలు వినియోగించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అలాగే ఆయా శాఖ అధికారులు చేపట్టే కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.



కాకినాడలో ఓ పరీక్షా కేంద్రంలో గురువారం పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు

కాకినాడ రూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఈనెల 1న ప్రారంభమైన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారం ముగిశాయి. కెమిస్ట్రీ-1, కామర్స్-1, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్టు డీఐఈవో జీజీకే నూకరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగిన పరీక్షలకు జనరల్ విద్యార్థులు 21,991 మంది హాజరుకావాల్సి ఉండగా 21,171 మంది హాజరయ్యారని, 820 మంది పరీక్షరాయలేదన్నారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 1677 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1496 మంది హాజరయ్యారని, 181 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారన్నారు. శనివారం ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు సంబంధించిన కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయని డీఐఈవో నూకరాజు తెలియజేశారు.

సచివాలయాల ప్రక్షాళన

- క్లస్టర్ల వారీగా సిబ్బంది విభజన
- జనాభా ప్రాతిపదికన సర్దుబాటు
- ఇంకా మిగిలితే సంబంధిత శాఖలకు కేటాయింపు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 13(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించి గ్రామ, వార్డు జనాభా ఆధారంగా సచివాలయాలను మూడు కేటగిరీలుగా విభజించేందుకు మార్గదర్శకాలను విడుదలచేసింది. దీంతో జిల్లాలో 445 గ్రామ సచివాయలాలు, 175 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి క్లస్టర్ల వారీగా సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. సచివాలయాల్లో సగటున 11 మంది చొప్పున ఉద్యోగులు ఉండాలి. ఈ ప్రకారం జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో 6820 మంది ఉండాలి. అయితే గత ప్రభుత్వం పోస్టులను పూర్తి స్థాయిలో భర్తీ చేయలేదు. టెక్నికల్, నాన్ టెక్నికల్ కేడర్లకు చెందిన ఉద్యోగులు 4,580 మంది మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నారు. కొన్ని సచివాలయాల్లో పదిమందికిపైగా సిబ్బంది ఉండగా అత్యధిక సచివాలయాల్లో సగం కన్నా తక్కువ మంది ఉన్నారు. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉన్న సచివాలయాల్లో సరైన పని ఉండడం లేదనే విమర్శలు ఉన్నాయి. తక్కువ మంది సిబ్బంది ఉన్నచోట పనిభారం అధికంగా ఉంది. ఇటువంటి పరిస్థితులను చక్కదిద్ది సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జనాభా ఆధారంగా ఉద్యోగులను సర్దుబాటు చేయనుంది. అలాగే క్లస్టర్లు కూడా ఏర్పాటు చేయనుంది. 3500 మంది అంతకన్నా ఎక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు 8 మంది సిబ్బంది ఉంటారు. 2500 నుంచి 3500 మంది జనాభా ఉంటే ఏడుగురు, 2500 కన్నా తక్కువ జనాభా ఉన్న సచివాలయాలకు ఆరుగురు వంతున ఉద్యోగులను కేటాయిస్తారు. ఇంజనీరింగ్, వ్యవసాయశాఖల్లో టెక్నికల్ సిబ్బందిని రెండు సచివాలయాలకు ఒకరి చొప్పున సర్దుబాటు చేస్తారు. జనాభా ప్రాతిపదికన సచివాలయాల్లో ఉద్యోగులను సర్దుబాటు చేసిన తరువాత ఇంకా మిగిలి ఉన్న ఉద్యోగులను సంబంధిత శాఖలకు కేటాయిస్తారు. ఈ విభాగంలో నాలుగు కేటగిరీల ఉద్యోగులైన పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు సర్వేలు చేపడతారు.



సాంకేతిక..

వ్యవసాయ, సెరికల్చర్, ఉద్యాన, ఇంజనీరింగ్, ఆరోగ్య, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్ సహాయకులు ఉంటారు.

ఇన్ఫర్మేషన్..

ఈ విభాగంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ప్రవేశమున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఉద్యోగులను గుర్తించి ఈ విభాగంలో చేర్చనున్నారు. వీరిని ఐటీ అవసరాలకు వినియోగించనున్నారు.

రెవెన్యూ..

ఈ విభాగంలో వీఆర్వోలు, సర్వేయర్లు ఉంటారు. కాగా మహిళా పోలీసులను ఐసీడీఎస్, పోలీస్ స్టేషన్లలో నియమిస్తారు. కానీ వీరు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించడానికి విముఖత చూపుతున్నారు.

ఆవిర్భావ సభకు పటిష్ఠ బందోబస్తు


జనసేన ఆవిర్భావ సభ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బిందుమాధవ్

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీ ఆవిర్భావ సభకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో శుక్రవారం జరిగే ఆవిర్భావసభవద్ద భద్రతా ఏర్పాట్లను గురువారం రాత్రి ఆయన జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలిసి పరిశీలించారు. సభాప్రాంగణం, వేదిక, హెలిప్యాడ్ తదితరాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.సభా ప్రాంగణంతోపాటు సభకు వచ్చే మార్గాల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాహనాలను నిర్ధేశించిన ప్రాంతాల్లోనే పార్కింగ్ చేసేలా చూడాలని చెప్పారు. అనంతరం ఆవిర్భావ సభ బందోబస్తు నిమిత్తం వివిధ జిల్లాల నుంచి పోలీసు అధికారులు, పోలీసులకు ఆయన పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్పీలు భాస్కరరావు, సత్యనారాయణ, కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ట్రైనీ ఏఎస్పీ సుస్మిత, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఉన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో జనసేనలోకి చేరికలు


పార్టీ కండువాలు కప్పి జనసేనలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

గొల్లప్రోలురూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో గురువారం రాత్రి పలువురు వైసీపీ నేతలు జనసేనలో చేరారు. పిఠాపురం మునిసిపల్ కౌన్సిలర్ బొజ్జా జగదీశ్వరీ, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు), దుర్గాడ న్యాయవాది ఇంటి సర్వారాయుడు(బాబు) సహా 31మంది జనసేనలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ పటిష్ఠతకోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావసభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, గోదావరి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు పునరంకితం అవుతాం


పిఠాపురం మండలం చిత్రాడ ఆవిర్భావ సభ వేదిక జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో మంత్రి దుర్గేష్, ఎంపీ ఉదయశ్రీనివాస్ తదితరులు

- పిఠాపురం ప్రజలకు నిండు మనస్సుతో కృతజ్ఞతలు
- ఆవిర్భావ సభకు మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నాం
- రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభ ద్వారా ప్రజాసేవకు పునరంకితం కావడంతోపాటు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను నిండు మనసుతో ఆశీర్వదించిన పిఠాపురం ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తామని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడజిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో జరిగే జనసేన ఆవిర్భావ సభ వేదికవద్ద గురువారం రాత్రి రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దేశచరిత్రలోనే తొలిసారిగా..

11ఏళ్లపాటునిస్వార్థమైన పవన్‌కల్యాణ్ రాజకీయ ప్రస్థానంతో ఈ రోజున అధికారంలోకి భాగస్వాములుగా ఉన్నామని జనసేన పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దేశచరిత్రలోనే తొలిసారిగా పోటీ చేసిన ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలన్నింటిలో విజయం సాధించి చరిత్ర సృష్టించామన్నారు. ఈ విజయం ప్రజలకోసమని, వారు ఏ విధంగా తమపై నమ్మకంతో గెలిపించారో దాన్ని నిలబెట్టుకుంటూ ఈ సభ ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా కృషిచేస్తామని చెప్పారు. జనసేన పోరాటంలో పవన్‌కల్యాణ్‌తో నిలబడిన జనసైనికులు, వీరమహిళలను ఆవిర్భావ సభలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం చేసేందుకు 14 కమిటీలు ఏర్పాటు చేసి 450 మందిని సభ్యులుగా నియమించామని చెప్పారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంనుంచే ఆహ్వాన కమిటీలో 250మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. సభకు వచ్చిన ప్రతిఒక్కరినీ అతిథులుగా ఆదరించి గౌరవిస్తామని, వారు తిరిగి వెళ్లే సమయంలో నాలుగు ప్రధాన రహదారులపై ఎంపీలు, ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. జనసేన పార్టీని ఒక నమ్మకంతో ప్రజలు గెలిపించారని, తమ జీవితాల్లో మార్పులు వస్తాయని వారు భావించారని మంత్రి తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా అభివృద్ధి చేసి చూపించడంతోపాటు సంక్షేమాన్ని ప్రతి కుటుంబానికి చేరుస్తామని చెప్పారు.

మధ్యాహ్నమే సభ ప్రారంభం

జనసేన పార్టీ ఆవిర్భావ సభ కార్యక్రమాలు మధ్యాహ్నం 3.30గంటలకు ప్రారంభమవుతాయని మంత్రి నాదెండ్ల తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా ఒక మత్స్యకార ప్రతినిధి, పవన్‌కల్యాణ్ పర్యటించిన ఏజెన్సీ గ్రామాల ప్రతినిధిలో రోడ్ల నిర్మాణంతో వారి జీవితాల్లో వచ్చిన మార్పులు, యువత ద్వారా జనసేన నుంచి ఏం ఆశిస్తున్నారు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి తదితర అంశాలపై అభిప్రాయాలతో ప్రసంగాలు ఉంటాయని వివరించారు.

అభివృద్ధి గురించి వివరిస్తాం

పిఠాపురం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజంటేషన్, కాకినాడ జిల్లాతోపాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నవరం కేంద్రంగా టెంపుల్ టూరిజం సర్క్యూట్ అభివృద్ధి చేయాలని పవన్ చెప్పిన దానికి అనుగుణంగా తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తామన్నారు. రాజకీయ నాయకుల ప్రసంగాలతోపాటు చివరిగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రసంగం ఉంటుందని చెప్పారు. పలు ఆడియో, వీడియో ప్రజంటేషన్లు ఉంటాయని చెప్పారు. సభా ప్రవేశమార్గాలకు డొక్కా సీతమ్మ, సత్యలింగనాయకర్, పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్‌ల పేర్లను పెట్టినట్లు తెలిపారు. రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా సమాజం,రాష్ట్రం, దేశంకోసం పునరంకితమయ్యే దిశగా సభ ఉంటుందని చెప్పారు. తమకు గతంలో జరిగిన అవమానాలు, ఇబ్బందుల గురించి కాకుండా ప్రజలకోసం రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసమే ఆలోచిస్తామని స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జనసేన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు.. కాకినాడ జిల్లాలో

పవన్ పర్యటన

- జనసేన ఆవిర్భావ సభలో పాల్గొననున్న డిప్యూటీ సీఎం


చిత్రాడవద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్

పిఠాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుక్ర, శనివారాల్లో కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పాల్గొననున్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 14వతేదీ ఉదయం 9.35గంటలకు హైదరాబాద్ మాదాపూర్‌లోని నివాసంనుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి 10గంటలకుబయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు 10.40గంటలకు చేరుకుని, అక్కడినుంచి మంగళగిరి క్యాంప్ ఆఫీసుకు వెళ్తారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం హెలీపాడ్‌నుంచి మధ్యాహ్నం 3గంటలకు బయలుదేరి చిత్రాడవద్ద జరిగే జనసేన ఆవిర్భావసభలోని హెలిపాడ్‌వద్దకు 3.45 గంటలకు చేరుకుంటారు. రాత్రి 7.30గంటల వరకూ ఆవిర్భావ సభలో పాల్గొని చిత్రాడనుంచి బయలుదేరి కాకినాడ జేఎన్‌టీయూ అతిథిగృహానికి చేరుకుని అక్కడ రాత్రిబసచేస్తారు. 15వతేదీ ఉదయం 9.15 గంటలకు అతిథిగృహంనుంచి బయలుదేరి కాకినాడ పోలీసు పెరేడ్‌గ్రౌండ్స్‌నుంచి హెలికాప్టర్‌లో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

వైభవంగా రంగనాథ కల్యాణం

కోరుకొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం రంగనాథ స్వామి ఆలయం వద్ద శ్రీ భూ సమేత రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వైకానస ఆగమ శాస్త్రం ప్రకారం పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో అనువంశిక అర్చకులు పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగుఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు మంత్రోచ్చారణల మధ్య వంశ పారంపర్య కల్యాణ దాత గొట్టుముక్కల అన్నమాచార్య కుటుంబ సభ్యులు ఎస్‌టీపీ వెంకటరమణాచార్య స్వామి దంపతులు కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు పాలకొల్లు నుంచి వచ్చిన భక్తులు, వెంకటరమణాచార్య శిష్యులు.. బాదంపాలు, ప్రసాదాలు అందజేశారు. కల్యాణాన్ని జరిపించిన ఆగమ బ్రహ్మలను అనువంశిక ధర్మకర్తలు, శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు పరాసర లక్ష్మీనరసింహభట్టర్, రంగరాజ భట్టర్, రఘునాథ భట్టర్‌లను, అర్చకులను, ఆలయ అధికారులను కల్యాణకర్త దంపతులు సత్కరించారు. పదేళ్లగా ఈ కల్యాణం నిర్వహిస్తున్న వెంకటరమణాచార్య దంపతులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గజవాహనంపై నరసన్న గ్రామోత్సవం

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి లక్ష్మీనరసింహస్వామికి గజవాహనంపై గ్రామోత్సవం చేశారు. దిగువ దేవస్థానం వద్ద సేవాకాలం నిర్వహించి స్వామి వారిని ఆలయ అర్చకులు గజవాహనంపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల మధ్య గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు ఫల పుష్పాలు, మంగళ నీరాజనాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ నరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషమాల, శేష వస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న విశిష్టాద్వైత పండిత సభల్లో రామనుజ ముని జీయర్ స్వామి, ఉభయ వేదాంత పండితులు గుదిమెళ్ళ మురళీకృష్ణామాచార్య స్వామి(భద్రాచలం స్థానాచార్యులు), పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రఘునాథ భట్టర్, స్థలసాయి ఉపన్యసించారు. కల్యాణోత్సవాలకు వచ్చిన భక్తులకు స్థానిక మిరియాల వెంకటరెడ్డి పంతుల ధర్మసత్రంలో ఉదయం, సాయంత్రం అన్నప్రసాదాలు అందజేస్తున్నట్టు సత్రం ఈవో గండి వెంకటలక్ష్మీకుమార్, వి.సూరిబాబు తెలిపారు.


గజవాహనంపై నిర్వహిస్తున్న నరసన్న గ్రామోత్సవం

కాకినాడ జిల్లా పోలీసులకు సీసీ కెమెరాల వితరణ


ఎస్పీ బిందుమాధవ్‌కు సీసీ కెమెరాలు అందిస్తున్న మురళి

కాకినాడ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని సూర్యారావుపేట ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి పోలీసు శాఖకు రూ.1.20 లక్షలు విలువైన సీసీ కెమెరాలను అందించారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్పీ బిందుమాధవ్‌ను కలిసి సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణకు సీసీ కెమెరాలు పోలీసు శాఖకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సర్పవరం ఎస్‌హెచ్‌వో పెద్దిరాజు చొరవతో సీసీ కెమెరాలు అందించిన పారిశ్రామికవేత్త మురళిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ఇండస్ట్రీస్ ఈడీ ఎన్.శిశిర్, హెచ్‌ఆర్ పీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు 9850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజీ నుంచి మూడు డెల్టా కాలువలకు 9850క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2950క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1900 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5వేల క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,235క్యూసెక్కులుగా ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.10 అడుగులుగా, పాండ్ లెవెల్‌గా 13.75మీటర్లుగా నమోదైంది.

వెంకన్న ఆలయంలో ఎమ్మెల్సీ 'సోము' పూజలు


వెంకన్న ఆలయంలో సోము దంపతులు

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. సోము దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

ఆత్రేయపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలిలో ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలాఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం లక్ష్మీపోలవరానికి చెందిన అరుగుల చంద్రరావు(63) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే ఓశుభ కార్యక్రమానికి నడుచుకుంటూవెళ్తున్నాడు. ర్యాలి జిమ్‌సెంటర్‌వద్దకు వచ్చేసరికి క్రిషి ట్రాక్టర్ డ్రైవర్ అజాగ్రత్తవల్ల బలంగా ఢీకొనడంతో చంద్రరావు అక్కడిక్కడే మృతిచెందాడు. దీనిపై మనుమడు చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఏఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొన్న బైక్

- ఒకే కుటుంబంలోని మామ్మ, మనవడు దుర్మరణం
- తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో ఘటన
- గోపాలపురం గ్రామంలో విషాదఛాయలు




మీరాతున్నీస, సమీర్(పాత చిత్రాలు).. దేవరపల్లి మండలం దుద్దుకూరు సమీపంలో సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దేవరపల్లి/గోపాలపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) భర్తకు గుండె ఆపరేషన్ చేయించి నెల కాకుండానే భార్య, మనవడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామానికి చెందిన మామ్మ షేక్ మీరాతున్నీస (50), మనవడు షేక్ సమీర్(17) కీడుబట్టలు కట్టుకోవడానికి గురువారం కొవ్వూరు మండలం పంగిడి సమీపంలోని గోవర్ధనమెట్ట వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి బయల్దేరారు. 1.30గంటల సమయంలో దేవరపల్లి మండలం దుద్దుకూరు గ్రామ సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిపై ఎదురుగా వెళ్తున్న లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక మోటారు సైకిల్‌పై వస్తున్న వీరు లారీని ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మీరాతున్నీస చికిత్స పొందుతూ మృతిచెందింది. సమీర్‌ను మెరుగైన వైద్యంకోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యాధికారులు తెలిపారు. మీరా తున్నీస కుమారుడు షేక్ రియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడు సమీర్(17) స్థానిక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయసంవత్సరం సీఈసీ చదువుతున్నాడు. తండ్రి రియాజ్ వడ్రంగి పనిచేస్తుంటాడు. ఆయనకు చేదోడుగా ఉంటూ ఖాళీ సమయాలు, సెలవు రోజుల్లో తండ్రితో కలిసి వెళ్తూ పనిలో సాయం చేస్తుంటాడు. గురువారం పరీక్ష లేకపోవడంతో నానమ్మను ద్విచక్ర వాహనంపై బంధువుల ఇంటికి తీసుకెళ్లాడు. సమీర్ స్నేహితులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు.

కారు ఢీకొని మోటారుసైక్లిస్టు మృతి

ఐ.పోలవరం/ముమ్మిడివరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం కొమరగిరి వద్ద గురువారం రాత్రి కారు ఢీకొని ముమ్మిడివరానికి చెందిన వంటపాటి వీరేంద్ర (32) మృతి చెందాడు. యానాం నుంచి మోటారు సైకిలుపై వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ముమ్మిడివరం నగర పంచాయతీ 20వ వార్డు మట్టాడిపాలేనికి చెందిన వంటపాటి రాముడు-లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. వారిలో పెద్దవాడైన వీరేంద్రకు భార్య నాగవెంకటదుర్గ, ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీదివ్యలక్ష్మి, ఆరవ తరగతి చదువుతున్న దివ్యశ్రీ ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటోంది. వీరేంద్ర లారీపై జట్టు కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరేంద్ర మృతితో ఆ కుటుంబం ఆదరణ కోల్పోయింది.


వీరేంద్ర (పాత చిత్రం)



హీరో శ్రీకాంత్‌ను ఆశీర్వదించి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకస్వామి

అంతర్వేది నరసన్న సన్నిధిలో సినీ హీరో శ్రీకాంత్

అంతర్వేది, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హీరో శ్రీకాంత్ గురువారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.ప్రదక్షిణ తర్వాత అంతరాలయంలో స్వామివారి దర్శనం చేయించి వేదపండితులు మహదాశీర్వచనం ఇచ్చారు. అర్చకులు ఆయనకు స్వామిచిత్రపటం,ప్రసాదం అందజేశారు.

ఉత్తమ ప్రదర్శనగా 'కనకపుష్యరాగం'

గొల్లప్రోలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా కళా తోరణం బత్తుల మురళీకృష్ణ కళా వేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల నాటక ప్రదర్శన పోటీలు గురువారం ముగిశాయి. విజయవాడ దృశ్య వేదిక కళాకారుల 'కనకపుష్యరాగం' నాటకం ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారుల 'ఇది అతని సంతకం', తృతీయ ప్రదర్శనగా కాకినాడ కార్తికేయ క్రియేషన్స్ కళాకారుల 'ఎడారిలో వాన చినుకు' ఎంపికయ్యాయి. ఉత్తమ దర్శకుడిగా ఎస్‌కే మిశ్రో (కనకపుష్యరాగం), రచనగా వల్లూరి శివప్రసాద్ (అన్నదాత), ఉత్తమ నటుడిగా దొంతల ప్రకాష్ (కనకపుష్యరాగం), నటిగా జ్యోతి (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ ప్రతి నాయకుడిగా కొల్లా రాధాకృష్ణ (అన్నదాత), హాస్య నటుడిగా ఈవన రమేష్‌బాబు (కనకపుష్యరాగం), సహాయ నటుడిగా బి.గణేష్ (ఎడారిలో వాన చినుకు), సహాయ నటిగా జి.నాగకుసుమసాయి (ఇది అతని సంతకం), ఉత్తమ క్యారెక్టర్ నటిగా శోభారాణి (అన్నదాత), క్యారెక్టర్ నటుడిగా రాధాకృష్ణ (ఎడారిలో వాన చినుకు), ఉత్తమ సంగీతం-లీలామోహన్ (ఇది అతని సంగీతం), ఆహార్యం-నాగు (ఎడారిలో వానచినుకు), ఉత్తమ రంగాలంకరణ-శివధామ్ (ఇది అతని సంతకం), జ్యూరీ అవార్డులకు పుష్యమి, కేబీ ఆనంద్ (భౌ..భౌ..భౌ) ఎంపికయ్యారు. విజేతలకు అపర్ణా నాటక కళా పరిషత్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వేట్లపాలెం ఎత్తిపోతల పథకం నిర్వహణకు ఆయకట్టు రైతుల నిర్ణయం

సామర్లకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెం ఎత్తిపోతల పథకం నిర్వహణను ఇక నుంచి తామే స్వీకరిస్తామని ఆయకట్టు పరిధిలోని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతల పథకాల ఆయకట్టు కమిటీల నుంచి తీర్మానాలు కోరిన నేపథ్యంలో గురువారం సాయంత్రం వారు సమావేశమయ్యారు. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు పొందే రైతులంతా ఎకరాకు ప్రతి పంటకు రూ.వెయ్యి చొప్పున చెల్లించేందుకు, పంపులు, మోటార్ల మరమ్మతు ఖర్చులను, ఆపరేటర్ల వేతనాలను రైతు కమిటీలే భరించేందుకు నిర్ణయించారు. కమిటీ ప్రతినిధులు వేగుళ్ల బాబ్జీ, కొండపల్లి రాంబాబు, గుణ్ణం వెంకట్రావు, సోమన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.


జనసేన నాయకులు అందజేసిన పెన్నులతో పిఠాపురం బీఎంఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు

విద్యార్థులకు పెన్నుల బహూకరణ

పిఠాపురం/గొల్లప్రోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు దాతలు పెన్నులు అందించడమే గాక ఉన్నత పాఠశాలలకు అవసరమైన కుర్చీలు, మైక్‌సెట్ అందజేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ మనోహర్, ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ మార్గదర్శనంలో తెనాలి నియోజకవర్గం అత్తోట జనసేన నాయకులు దివ్వెల వెంకయ్యనాయుడు, ఏడుకొండలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పిఠాపురంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, చిత్రాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పెన్నులు పంపిణీ చేశారు. గొల్లప్రోలు హైస్కూలుకి 15 కుర్చీలు, చిత్రాడ స్కూలుకి మైక్‌సెట్ అందజేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికే 'పొలంబడి'

సామర్లకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇచ్చే శిక్షణే 'పొలంబడి' అని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని నవర గ్రామంలో వ్యవసాయాధికారిణి ఐ.సత్య అధ్యక్షతన గురువారం ఇండిగాప్ పొలంబడి నిర్వహించారు. రైతులతో కలిసి వ్యవసాయాధికారులు దాళ్వా సాగు వరి పొలాలను సందర్శించారు. తెగుళ్ల వ్యాప్తి, నివారణాంశాలను, మెళకువలను డీఏవో విజయకుమార్ వివరించారు.

కిడ్నీ వ్యాధిపై అవగాహన

సామర్లకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మూత్రపిండాల వ్యాధి నివారణ దినాన్ని పురస్కరించుకుని పనసపాడులోని మెడికవర్ అనుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అమరేంద్ర గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీకేడీ రోగుల్లో 87 శాతం మందికి హైబీపీ ఉంటుందని, వారిలో 37.5 శాతం మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించామన్నారు. ప్రతి ఒక్కరూ ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకుంటే ఈ వ్యాధి బారి నుంచి కాపాడవచ్చని యూరాలజిస్ట్ కళ్యాణ్ బాబు చెప్పారు.

భోజనాలు, చలివేంద్రాల ఏర్పాటు

పిఠాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు వచ్చే వారి కోసం పిఠాపురం నియోజకవర్గంలో నాలుగు కేంద్రాల్లో భోజనాలు, తాగునీరు, మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. చేబ్రోలు నుంచి గొల్లప్రోలు వెళ్లే 216 జాతీయ రహదారిపై చెందుర్తి కూడలిలోని దుర్గమ్మ ఆలయం వద్ద, గొల్లప్రోలు బైపాస్ వై.జంక్షన్ హెచ్‌పీ పెట్రోల్‌బంకు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో, గొల్లప్రోలు టోల్‌ప్లాజ్-పిఠాపురం బైపాస్ వై.జంక్షన్ వద్ద గల రైస్‌మిల్లు ఆవరణలో, పిఠాపురం బైపాస్‌రోడ్డులో గోపాల్‌బాబా ఆశ్రమంగా ఎదురుగా ఉన్న స్థలంలో ఈ కేంద్రాలు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉంటాయి.

ప్రజల ఆరోగ్య అవసరాలకు అండగా ఉంటాం: ఎమ్మెల్సీ నాగబాబు

గొల్లప్రోలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య అవసరాలకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌నివాసంలో గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పిఠాపురం నియోజవర్గంలో 12 మందికి మంజూరైన రూ17.89 లక్షలను ఆయన అందజేశారు. జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఆవిర్భావ సభ సమన్వయకర్త పీవీఎస్ఎన్ రాజు, పంచకర్ల సందీప్, అధికార ప్రతినిధి భరత్, గోదావరి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

ఘనంగా తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి

సర్పవరం జంక్షన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని పామరులకు సైతం అర్థమయ్యేలా తేనెలొలికే తెలుగు భాషలో రచించిన మొట్టమొదటి కవయిత్రి మొల్లమాంబ అని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోట్ క్లబ్ ఆవరణలో మొల్ల జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి తదితరులు పాల్గొన్నారు.


మొల్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నానాజీ


జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారితో ల్యాబ్ టెక్నీషియన్లు

'ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలి'

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న పాథాలజీ డిపార్ట్‌మెంట్ లెక్చర్ గ్యాలరీలో జీజీహెచ్ ల్యాబ్ టెక్నీషియన్ల ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ ల్యాబ్ టెక్నీషియన్స్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి మాట్లాడుతూ ఎంతో ఏకాగ్రతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. వైద్య పరీక్షల నివేదికల్లో విలువలు ఏమాత్రం తారుమారైనా రోగి ఆరోగ్యానికి సంబంధించి చికిత్సా విధానం పూర్తిగా మారుపోతుందని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ వృత్తి కత్తిమీద సాము లాంటిదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఫోరెన్సిక్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నకుమార్, బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురజనాపల్లి హైస్కూల్లో మహాత్ముల విగ్రహాల ఆవిష్కరణ

కరప, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గురజనాపల్లి హైస్కూల్లో ఉపాధ్యాయుడు ఐ. ప్రసాదరావు ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ రాష్ట్రపతులు ఏపీజే అబ్దుల్ కలాం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలను విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి గురువారం ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షలను ఎటువంటి భయాందోళన లేకుండా చక్కగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలంటూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. యంగ్‌మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాకాడ వెంకటరమణ ఆధ్వర్యంలో 76 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఈవో-1 కేవీ కృష్ణవేణి, ఎంఈవో-2 పి.సత్యనారాయణ, సర్పంచ్ అనుసూరి శ్రీనివాసరావు, హెచ్‌ఎం సాయిమోహన్, ఎస్ఎంసీ ఛైర్మన్ పోలినాటి నూకరాజు, పబ్బినీడి పాపారావు తదితరులు పాల్గొన్నారు.


అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

డీఎస్ఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాళ్లరేవు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బూత్ ఇన్‌చార్జి టేకుమూడి సత్యనారాయణ నేతృత్వంలో నాలుగు రోజులు జరిగే ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (డీఎస్ఆర్) మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక నేతలు గురువారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, టీడీపీ సీనియర్ నేత ఉంగరాల వెంకటేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ధూళిపూడి వెంకటరమణ, గంజా సూరిబాబు పరిచయం చేసుకున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు, ఆయా జట్ల సభ్యులు పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

చంద్రబాబు దృష్టికి 'కాకినాడ రూరల్' సమస్యలు


ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి దంపతులు

సర్పవరం జంక్షన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో-ఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి దంపతులు గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వివరించి, నిలిచిపోయిన పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిధులు మంజూరు చేస్తానని, నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రులను సీఎం చంద్రబాబు ఆదేశించినట్టు పిల్లి దంపతులు తెలిపారు. అనంతరం వారు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఇన్‌చార్జి మంత్రి నారాయణలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మాజీ జడ్పీటీసీ బుంగా సింహాద్రి, మాజీ ఎంపీటీసీలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

'ఇష్టంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలి'

తాళ్లరేవు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం హైస్కూలు హెచ్‌ఎం పీవీ శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ ఫంక్షన్ జరుపుకున్నారు. పబ్లిక్ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విశ్రాంత ఉద్యోగులు వుంగరాల రవీంద్ర, అత్యం సూర్యనారాయణమూర్తి వివరించారు. ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం వారు 90 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ ఛైర్మన్ బల్ల చిరంజీవి, సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ, సుబ్బారావు, శుభ, విల్ల సత్యనారాయణ, వుంగరాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అడబాల'కు సత్కారం

సర్పవరం జంక్షన్, మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): జనసేన ఆవిర్భావం నుంచీ పార్టీ అభివృద్ధి, బలోపేతానికి విశేష కృషి చేసిన నగర శాఖ ఉపాధ్యక్షుడు, దిశ కమిటీ సభ్యుడు అడబాల సత్యనారాయణను మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ సత్కరించారు. జనసేన కంట్రోల్ రూమ్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జిల్లా శాఖ అధ్యక్షుడు తుమ్మల బాబు, సివిల్ సప్లయిస్ రాష్ట్ర ఛైర్మన్ తోట సుధీర్ పాల్గొన్నారు.

భావనారాయణస్వామి హుండీల ఆదాయం రూ.8.52 లక్షలు

సర్పవరం జంక్షన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సర్పవరం శ్రీరాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయంలోని హుండీలను సీఎఫ్‌వో వీరభద్రరావు ఆధ్వర్యంలో గురువారం తెరిచి లెక్కించారు. రూ.8,52,983 ఆదాయం లభించిందని గ్రేడ్-1 ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ పుల్ల శ్రీరాములు, మాజీ ఛైర్మన్ పుల్ల శ్రీను, అర్చకులు, సిబ్బంది, గ్రామస్తులు, సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నేతలపై కేసుల కొట్టివేత

ఎమ్మెల్యే చినరాజప్పకు విముక్తి



సామర్లకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ వ్యవహారంలో ఆనాటి ఘటనల్లో పాల్గొన్న పలువురు టీడీపీ నేతలపై పెట్టిన కేసులపై గురువారం విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరిగింది. విచారణకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కూడా హాజరయ్యారు. వారిపై కేసులు కొట్టివేస్తూ జడ్జి తీర్పునిచ్చారు. దీంతో రాజప్పకు విముక్తి లభించింది.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గడిచిన ఐదేళ్లలో నిర్వీర్యమైన విద్యా శాఖను పూర్తిగా ప్రక్షాళన చేసినందుకు అభినందించారు. రాజప్ప వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు వున్నారు.

ఆదిత్య విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గండేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో ద్వితీయ సంవత్సర డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు, సిబ్బంది ఏలేశ్వరంలో ఉన్న మణిహంస పవర్‌ప్లాంట్‌ను సందర్శించినట్లు విభాగాధిపతి డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా అక్కడ ఉన్న హైడ్రోటర్బైన్లు, మోటార్లు, డిజిటల్, అనలాగ్ మీటర్లపై అవగాహన పొందారు. విద్యుత్ ఉత్పత్తి సరఫరా తదితర అంశంపై అవగాహన కల్పించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నిర్వాసితులకు న్యాయం చేయాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నిర్వాసితులతో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కూనవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా నష్టపోతున్న ప్రతీఒక్క నిర్వాసితుడికి ప్రభుత్వం న్యా యంచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కూనవరం మండలంలో ఆయన పర్యటించి పోలవరం నిర్వాసితులను కలిశారు. కాంటూర్ పద్ధతిలో కాకుండా నిర్వాసితులందరినీ ఒకే ప్రాతిపదికన తీసుకువచ్చి పరిహారం అందించాలన్నారు. గతంలోని కటా ఫ్ డేట్ కాకుండా నిర్వాసితులను తరలిస్తున్న సమయాన్నే కటాఫ్ డేట్‌గా పరిగణించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరికీ పరిహారం అందించాలన్నారు. ఇప్పటికే నిర్వాసితుల పేర్లు గల్లంతయ్యాయని ఆందోళన చెందుతున్నారని అర్హులైన ప్రతీఒక్కరినీ గుర్తించి జాబితాలో చేర్చాలన్నారు. ప్రతీ నిర్వాసితుడికి న్యాయం జరిగేందుకు తాము పోరాటం సాగిస్తామన్నారు. రంపచోడవరం సీపీఎం డివిజన్ కార్యదర్శి బొప్పన కిరణ్, మండల సీపీఎం కార్యదర్శి బాబు, చెలకాని నాగరాజు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ ఒకేసారి పరిహారం చెల్లించాలి

ఎటపాక: పోలవరం కాంటూరు దశలతో సంబంధం లేకుండా నిర్వాసితులందరికీ నష్ట పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎటపాక మండలంలోని వీరాయిగూడెం, మురుమూరు గ్రామాల్లో పర్యటించా రు. 2022 జూలై నెలలో వచ్చిన గోదావరి వరదను ప్రమాణికంగా తీసుకుని, ప్రతీ గ్రామాన్ని ముంపుగా పరిగణించాలన్నారు. సీపీఎం పోరాటం తర్వాతనే 41.5 కాంటూరు పరిధిలోకి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో 30 గ్రామాలను చేర్చిందని చెప్పారు. తమ గ్రామం భద్రాచలం వద్ద 40 అడుగులు వస్తే ముంపున కు గురువుతుందని, 41.5 కాంటూరులో చేర్చలేదని, వరదల సమయంలో గ్రామం రోజుల తరబడి ముంపులో ఉంటుందని తెలిపారు. మురుమూరు గ్రామంను 41.5 కాంటూరులో చేర్చాలని ఈవిషయంను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం రంప చోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, ఐవీ పాల్గొన్నారు.

'పోలవరం నిర్వాసితులు ఆందోళన చెందొద్దు'



తహసీల్దార్‌ను కలిసిన నిర్వాసితులు

కూనవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితులు ఆందోళన చెందవద్దని కూనవరం తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. ఆర్ అండ్‌ఆర్ జాబితాలో అర్హుల పేర్లు రాకపోవడంతో కూనవరం పంచాయతీలోని నిర్వాసితులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిశారు. అర్హులైన సుమారు 450మంది కుటుంబాలు ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో రాలేదని దీని కారణంగా త్యాగంచేసిన తాము అన్ని విధాలుగా నష్టపోతున్నామని నిర్వాసితులు తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. పీడీ ఎఫ్ జాబితాలో అర్హులను గుర్తించి పేర్లు వచ్చే విధంగా చేయాలన్నారు. టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు, సీపీ ఎం నాయకులు లంబు శ్రీను, పారి సోమయ్య, ఉమామహేశ్వరరావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలపై దృష్టి సారించండి

• జిల్లా కలెక్టర్‌కు అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

ఎటపాక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం విలీన గ్రామాలైన కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం, ఎటపాకలో సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్పా శ్రీనివాస్ కోరారు. ఈమేరకు పాడేరు జిల్లా కేంద్రంలో కలెక్టర్‌ను కలిసి వినతపత్రం అందించారు. ఎటపాక పంచాయతీలోని రాజుపేట, పురుషోత్తపట్నం శ్రీరామ్‌నగర్ కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని, అంతర్గత రహదారుల అభివృద్ధి, సురక్షిత గోదావరి తాగునీరు సరఫరా చేయాలన్నారు. గిరిజన రైతులకు వ్యవసాయ బోర్లు వేయించాలన్నారు. ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేయాలని కోరారు. మండల కేంద్రమైన ఎటపాకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు జూనియర్ కళాశాలను మంజూరు చేయాలన్నారు. విలీన మండలాల ప్రజలకు మెరుగైన వైద్యం కోసం తెలంగాణలోని భద్రాచలం ఏరియా వైద్యశాలపై ఆధారప డాల్సిన దుస్థితి నెలకొందని, ఈ ప్రాంత ప్రజల కోసం మెరుగైన వైద్యసౌకర్యాలు కల్పించి, వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సత్వర పరి ష్కారానికి హామీ ఇచ్చినట్లు ముప్పా శ్రీనివాస్ తెలిపారు. టీడీపీ నాయకులు ఇటీవల అమ రావతి సచివాలయంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసి పై సమస్యలై విన్నవించగా, మంత్రి స్పందించి కలెక్టర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొడేటి రవికుమార్, ఎటపాక సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, పసుపులేటి రాంబాబు, తోటరమేష్ పాల్గొన్నారు.

'గిరిజనేతరుల గృహాల నిర్మాణాలు నిలిపివేయాలి'

రాజవొమ్మంగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి మండల పరిధిలో ఉన్న గ్రామాల్లో గిరిజనేరుతల పక్కా గృహాల నిర్మాణ పనులు తక్షణమే నిలిపివేయాలని గురువారం పేసా మండల కమిటీ అధ్యక్షుడు టి.సూరిబాబు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. శాఖాపరంగా ఆదేశాలు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు

• ఎంపీడీవో శ్రీనివాస్ విశ్వనాథ్

మారేడుమిల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి మండలం అన్ని గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ మెటీరియల్స్ నివారించడానికి మార్చి 15న శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1నుంచి మారేడుమిల్లి మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, దానిలో భాగం గా ప్రజాప్రతినిధులు, దుకాణాదారులు, రిసార్టు ఓన ర్లు, ప్లాస్టిక్ డీలర్సుతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రకృతి రమణీయతకు పెట్టింది పేరైన మారేడుమిల్లి మండలం టూరిస్టులకు కేంద్రంగా ఉన్నందున పారిశుధ్యానికి పాధాన్యత ఇచ్చి అందరి సహకారంతో పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని మండలంలో నివారించడానికి లక్ష్య ంగా ప్రణాళికలు చేపడుతున్నామని ఎంపీడీవో తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనుల ర్యాలీ



వారపు సంతలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

మారేడుమిల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాల్లో వారపు సంతల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. మారేడుమిల్లి, వై.రామవరం ఎగువప్రాంతంలోని పాతకోట, కోతవరం వారపుసంతలో గిరిజనులు బ్యానర్లు చేతపట్టి మావోయిస్టులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఏజెన్సీ మారుమూల గ్రామాలు సైతం రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని వీటిని అడ్డుకునే ప్రయత్నం మావోయిస్టులు చేయవద్దని నినాదాలు చేశారు.

'హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలి'

రంపచోడవరం, మార్చి13(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రంపచోడ వరం మండలం కాకవాడలో జరిగిన హిందూ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెద్దఎత్తున గిరిజనులు పలు గ్రామాల నుంచి తరలివచ్చారు. హిందూ సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలని, హిందూమతమంటేనే ఒక జీవన విధానమని, దానిని అనుసరించడం ద్వారా జీవన సాఫల్యం దక్కుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్నకుమారి, కాకవాడ సర్పంచ్ కొమరం పండుదొర, రిటైర్డు పబ్లిక్ ప్రాసిక్యూటర్ విండెల సామయ్య, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నారాయణరెడ్డి, బొగ్గుల కాటంరెడ్డి, పర్శిక ప్రకాశరావుదొర, రామసేన నాయకులు బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రకృతి వ్యవసాయాధికారుల తీరుపై ఎంపీటీసీల ఆగ్రహం

బడ్జెట్‌పై సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధ్యక్షతన గురువారం జరిగింది. పలు శాఖల అధికారులు తమ శాఖల కార్యక్రమాలను వివరించారు. ముఖ్యంగా వేసవిలో తాగు నీరు, విద్యుత్ ఇబ్బందులు లేకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు గొల్లపల్లి బుజ్జి ఆదేశించారు. విద్యుత్ కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూలో ఓల్టేజ్ అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించామని తెలిపారు. పెద్దనాపల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కృషి చేస్తున్నారని, దీనికి స్థల సేకరణ చేశామని ఎంపీపీ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు యిజనగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జి మాట్లాడుతూమండలంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు 61మంది గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కోసం రైతులకు ఉపయోగ పడలేదన్నారు. వీరు కేవలం రిజిస్టర్లకే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. 2025-26లో రూ.18,39,79,100 కోట్ల ఆదాయం, వ్యయం రూ.18,38,27,100, 1.52లక్షల మిగులు బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. పలు గ్రామాలకు స్వచ్ఛ భారత్‌లో భాగంగా చెత్త సేకరణకు మంజూరైన ట్రాక్టర్లను పంచాయతీలకు అందజేశారు. జడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీలు చిక్కాల రాజ్యలక్ష్మీదేవి, సాదే లోవరాజు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తునిరూరల్, మార్చి13(ఆంధ్రజ్యోతి): తుని పరిధిలో 33కేవీ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం కలుగుతుందని ఏఈ వీరభద్రరావు తెలిపారు. తునిలోని గొల్లపేట, దీవన్‌వీధి, బడవ వీధి, వెంకటేశ్వరస్వామి టెంపుల్ వీధి, ప్రకాశం రోడ్డు, ముస్లిం వీధి, చిన్నవీధి, పెద్దవీధి తదితర ఏరియాలో సరఫరా ఉండదన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తునిరూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తునిలో ఉన్న మహాత్మాజ్యోతిరావుపూలే సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుప్రిన్సిపాల్ యజ్ఞ విశ్వభారతి తెలిపారు. ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు అర్హులైన విద్యార్థులు ఈనెల15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని, పాఠశాలలో దరఖాస్తులు అందజేయచ్చని ఆమె తెలిపారు. ఈఅవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అటవీ భూముల్లో చెట్లు నరికితే చర్యలు

శంఖవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): శంఖవరం సెక్షన్ పరిధి అటవీ భూముల్లో అక్రమంగా చెట్లు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫారెస్టు సెక్షన్ అధికారి నాగేశ్వరరావు అన్నారు. సోషల్ మీడియాలో అటవీ భూముల్లో చెట్లు నరికేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వ్యాప్తి చెందడంపై ఆయన స్పందించారు. అటవీ భూముల్లో నిరంతరం గస్తీ నిర్వహిస్తామని అక్రమంగా చొరబడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవధాన్య విత్తనాల పంపిణీ

తొండంగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బెండపూడి గ్రామంలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు గురువారం నవధాన్య విత్తనాలను పంపిణీ చేశారు. మినుములు, పెసలు, జనుములు, నువ్వులు, పిల్లిపెసర, గోంగూర, బొబ్బర్లు, అనుములు, జొన్నలు, ఆవాలు, ఉలవలతో కూడిన 10కిలోల కిట్టును ఒక ఎకరాకు వినియోగించే నిమిత్తం 50మంది రైతులకు పంపిణీ చేశారు. వీటితో పాటు ఏడు రకాల కూరగాయల విత్తనాలతో ఉన్న కిట్‌ను వారికి అందించారు. ఏఈవో దైవ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనులపై సమావేశం

గండేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం తదితర పనులపై సామాజిక తనిఖీ నిర్వహించేందుకు సమావేశం జరిపారు. ఈ సమావేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన 1135 పనులకు 12కోట్ల 29లక్షల 13వేల రూపాలయపై తనిఖీ నిర్వహిస్తామని ఎస్‌ఆర్‌పి పి.సింహాద్రి తెలిపారు. ఏపీవో గంగాభవానీ, ఈసీ పి.రమేష్, టీఏలు శ్రీను, అబ్బులు, మోహన్, శ్రీనుపాల్గొన్నారు.

ఇరిగేషన్ స్థలం పరిశీలన

గండేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): గండేపల్లి గ్రామ శివారున ఉన్న పది ఎకరాల పోలవరం గట్టు ఇరిగేషన్ స్థలాన్ని గురువారం అసిస్టెంట్ కలెక్టర్ భావన పరిశీలించారు. తహశీల్దార్ శ్రీనివాస్ నుంచి పలు వివరాలు తెలుసుకున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఈస్థలం ఉపయోగపడుతుందని పరిశీలించినట్టు తెలిపారు. ఆమె వెంట వీఆర్వో అబ్బులు, సిబ్బంది ఉన్నారు.

15న జరిగే శ్రీనివాస కల్యాణానికి ఆహ్వానాలు



ఆహ్వాన పత్రికలు అందిస్తున్న దృశ్యం

జగ్గంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని వెంకటపాలెంలో గల శ్రీవారి ఆలయంలో ఈనెల15న శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించడానికి టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఈఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తదితరులకు వారు ఆహ్వానం పలికారు. అమరావతి 28గ్రామాల రైతులు, ప్రజలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు, జ్యోతుల నెహ్రూ, ఎమ్మెస్ రాజు, పనబాక లక్ష్మి తదితర బోర్డు సభ్యులు హాజరై శ్రీనివాస కల్యాణంలో పాల్గొంటారన్నారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మంత్రులు నిమ్మల రామానాయుడు, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, ఆరుమిల్లి రాధాకృష్ణ, బేబి నాయన, యనమల దివ్య, వనమాడి కొండబాబు, భాష్యం ప్రవీణ్, వేమిరెడ్డి శాంతి, రెడ్డమ్మ, కళా వెంకట్రావు, విష్ణుకుమార్ రాజు, పూసపాటి అతిథి, కొణతాల రామకృష్ణ, భాష్యం ప్రవీణ్ తదితరులకు ఆహ్వాన పత్రికలు అందించారు.

మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజ్యలక్ష్మి

రౌతులపూడి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. దీనికి పాల్గొన్న కూటమి నేతలు ఉన్నతి రుణాలు మంజూరైన ముగ్గురు మహిళలకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాంబశివరావు, హైస్కూల్ చైర్మన్ షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

జగ్గంపేట, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో గురువారం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ 27 మందికి సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం వారు ఆర్థికసాయం కోరారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సిఫార్సులతో వారికి ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరైంది. జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి మండలాలకు సంబంధించి 27మందికి రూ.25,22,204 చెక్కులను అందించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు పాల్గొన్నారు.

ధర్మవరంలో వైభవంగా రథోత్సవం





రథోత్సవానికి రథాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం, విద్యుత్ దీపాలంకరణతో రాజగోపాలస్వామి ఆలయం

ప్రత్తిపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవాన్ని జరిపారు. పూలతో అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి గ్రామోత్సవం చేశారు. స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చిట్టిబాబు ఆశయాల కోసం కృషి చేస్తా



కత్తిపూడిలో చిట్టిబాబు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దేవిదుర్గ, నాయకులు

శంఖవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పర్వత చిట్టిబాబు ఆశ యాల కోసం పనిచేస్తున్నట్లు ఆయన కుమార్తె దేవిదుర్గ అన్నారు. గురువారం చిట్టిబాబు వర్ధంతి సందర్భంగా కత్తిపూడిలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. శంఖవరంలో ఆయన సోదరుడు వైసీపీ ఎంపీపీ పర్వత రాజబాబు పేదలకు దుప్పట్లు పంచారు. కార్యక్రమంలో టీఎన్‌టీయుసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెన్నా శివ, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి వెంకట సుభాష్, జనసేన నేత మేకల కృష్ణపాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రత్తిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో పదో తరగతి చదువుతోన్న విద్యార్థులకు గురువారం సత్యసాయిబాబా భక్తులు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ప్రత్తిపాడులోని అఖిల్, మినర్వా, ధర్మవరంలోని హైస్కూల్, ఆదర్శ ప్రతిభా విద్యాలయాలకు చెందిన 150మంది టెన్త్ విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి సబ్ జోన్ సాయి బాబా సేవా దళ్ కన్వీనర్ జయబాబు, సాయి భక్తులు నాగేశ్వరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం సమ్మర్ క్రికెట్ కప్పు విజేత 'కుంట'

మోతుగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ఫిబ్రవరి 22న మోతుగూడెం దూలూరి భగవత్ రామలక్ష్మి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చిన్న కుమారుడు గోపి ఏపీ జెన్‌కో లోయర్ సీలేరు క్రికెట్ మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ చత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట గ్రామానికి చింతూరు మండలం ఎర్రపేట గ్రామం జట్లు ఫైనల్‌లో పోటీపడగా బ్యాటింగ్‌చేసిన కుంట జట్టు 16ఓవర్లకి 89 రన్స్ చేశారు. ఎర్రంపేట బ్యాటింగ్ చేసి 74 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో కుంట టీం విజేతగా నిలిచింది. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి ఎర్రంపేట, మూడో బహుమతి మోతుగూడెం టీం గెలుచుకుంది. ఈ జట్లకు సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు, సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన్న కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్ గెలుపొందిన వారికి షీల్డ్, నగదు బహుమతి అందజేశారు. లోయర్ సీలేరు ఏపీ జెన్‌కో అధికారులు వాళ్ల తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బెస్ట్ బౌలింగ్, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌లకు నగదు రూపంలో బహుమతి అందజేశారు. ముంపు మండలాల్లో, వరదల్లోని చేసిన బెస్ట్ నేషనల్ అవార్డు వచ్చిన మండల లైనింగ్ ఇన్‌స్పెక్టర్, ఈపీడీపీఎస్ లైన్‌మెన్ కె.గణేష్‌ను మోతుగూడెం దులూరి గోపి, లోయర్ సీలేరు, ఏపీ జెన్‌కో అధికారులు గణేష్‌ను శాలువా కప్పి సత్కరించారు.

దళారుల చేతిలో గిరిజనులు మోసపోకుండా

జీడిపిక్కల కొనుగోలుకు ఏర్పాట్లు

• ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



జీడిపిక్కల రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచల

రంపచోడవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో దళారుల చేతిలో గిరిజనులు మోసపోకుండా వారికి గిట్టుబాటు ధరలను చెల్లించి జీడిపిక్కలను కొనుగోలు చేసే ఏర్పాట్లను చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం అన్నారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో జీడిపిక్కల రైతులు, జీడిపిక్కల ప్రోసెసింగ్ యూనిట్ ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఏజెన్సీలో కొనుగోలు చేసిన జీడిపిక్కలను ఎక్కడికక్కడ ప్రాసెసింగ్‌చేసి మార్కెటింగ్ చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని, మన్యం గిరిజన రైతులకు ఐటీడీఏ అండగా ఉంటుందని ఆయన వివరించారు. గిరిజన జీడిమామిడి రైతులకు పురుగు మందులూ, ఎరువులూ యంత్రాలూ ఇప్పించాలని, జీడిపిక్కల పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కారం సురేష్, కె.భాస్కరరెడ్డిలు ప్రాజెక్టు అధికారికి విన్నవించారు. పీహెచ్‌వో కె.చిట్టిబాబు, ఉద్యాన వన సబ్ అసిస్టెంట్లు, జీడిమామిడి తోట రైతులు, జీడిపిక్కల ప్రాసెసింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ అంశంపై శిక్షణ

గండేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్ అంశంపై విద్యార్థుల అభివృద్ధి శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈనెల18 వరకు శిక్షణ జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. హైడ్రో ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో తరుణ్ కె.కరణం రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆపల్గొన్నారు.

ఆదిత్యలో ముగిసిన ఐవోటీ విద్యార్థి అభివృద్ధి శిక్షణ

గండేపల్లి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో బిల్డింగ్ స్మార్ట్ సిస్టమ్స్ యూజింగ్ ఐవోటీ అనే అంశంపై అతిథి ఉపన్యాసం ముగిసింది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో స్మార్ట్ సిస్టమ్స్‌ని బిల్డ్ చేసే రంగంలో వస్తున్న పరిజ్ఞానాన్ని ఆపిల్ టన్ సంస్థ స్థాపకుడు, అధినేత కనపర్తి బాపూజీ వివరించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు తమ సందేహాలను తెలుసుకున్నారు.

చిట్టిబాబుకు ముద్రగడ పరామర్శ

ప్రత్తిపాడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన అన్నవరం దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యుడు దో చిట్టిబాబును గురువారం ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. జలిగంపల ప్రభాకరరావు, శేరుకృష్ణ, దో దొరబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ రమణను విధుల్లోకి తీసుకోవాలని జేఏసీ నేతృత్వంలో రిలే నిరాహార దీక్షలు గురువారం కూడా కొనసాగించారు. ఎంప్లాయీస్ యూనియన్, యునైటెడ్ యూనియన్ సభ్యులు డిపో గేటు వద్ద మధ్యాహ్న భోజన విరామంలో ఎర్ర రిబ్బన్లు ధరించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. యూనియన్ డిపో కార్యదర్శి యుబీఎం కుమార్, యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌పి రావు, త్రిమూర్తులు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచ కిడ్నీ దినోత్సవం



మాట్లాడుతున్న చిన్నారావు

తుని రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని సూపరింటెండెంట్ అధ్యక్షతన ఆసుపత్రి ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. దీనికి విద్యార్థులతో పాటుగా పలువురు రోగులు హాజరుకాగా ఆరోగ్యకరమైన కిడ్నీ పనితీరుకు అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ చిన్నారావు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిరావాలి

జగ్గంపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు జగ్గంపేట నుంచి భారీ సంఖ్యలో హాజరుకావాలని జగ్గంపేట నియోజకవర్గం కోఆర్డినేటర్ గాంధీ, శ్యాంసుధాకర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ప్రజలను కోరారు. కార్యక్రమంలో రాందీపు, వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

కిర్లంపూడి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం నుంచి వీరవరం మీదుగా రామవరం వరకు జరిగే రోడ్డు విస్తరణ పనులను గురువారం పెద్దాపురం డీఈ ఈ.రాఘవరావు పరిశీలించారు. రాజుపాలెం గ్రామంలో రోడ్డు పనులను పరిశీలించారు. వీటి పనులు రూ.29కోట్లతో చేపట్టినట్టు తెలిపారు. చెరువు వైపు రోడ్డు విస్తరణ పెంచాలన్నారు. రాజుపాలెం ముందు భాగంలో పది అడుగులు రోడ్డు రావడంతో ఖాళీ చేయాల్సిన వాటికి మార్కింగ్ ఇచ్చామన్నారు. వీరవరం ముందు భాగంలో కూడా ఖాళీ చేయాలని మార్కింగ్ ఇచ్చామన్నారు. ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, ఏఈఈ సత్యశివప్రసాద్ శ్రీను పాల్గొన్నారు.